సాక్షి అనకాపల్లి

బుధవారం ; 19 ; ఏప్రిల్ ; 2023



కనకమ్మకు స్వర్ణ పుష్పార్చన

విశాఖ: కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించారు. 108 స్వర్ణపుష్పాలతో అర్చించారు.



నృత్యాభినయం

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ ఆలయ జాతరలో భాగంగా నిర్వహించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అలరించాయి.



ఆన్‌లైన్‌లో చందనోత్సవ టికెట్లు

సింహాచలం: ఆన్‌లైన్‌లో చందనోత్సవం టికెట్ల విక్రయాలు ప్రారంభమయ్యాయి. రూ.300ల టికెట్లు అందుబాటులో ఉంచారు.



న్యూస్‌రీల్

నేడు సీఎం వైఎస్ జగన్ రాక



మహారాణిపేట: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి బుధవారం విశాఖ వస్తున్నారు. ఉదయం 9.20 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 9.30 గంటలకు హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేట బయలుదేరుతారు. మూలపేట పోర్టు నిర్మాణానికి శంకుస్థాపనతోపాటు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. తిరిగి మధ్యాహ్నం రెండు గంటలకు సీఎం విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. ఇక్కడ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం బయలు దేరుతారు.

నేడు శ్రీప్రకాష్‌లో 'కేరింతలు' కార్యక్రమం

ముఖ్య అతిథిగా సాక్షి సంపాదకులు వి.మురళి

పాయకరావుపేట: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో బుధవారం 'కేరింతలు 2023' కార్యక్రమం జరగనుంది. ఎల్‌కేజీ నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న సుమారు 800 మంది విద్యార్థులతో ఆంధ్రవైభవాన్ని కీర్తిస్తూ మన సంస్కృతి, సంప్రదాయాలను నృత్య, నాటక, గేయ రూపంలో ప్రదర్శించనున్నట్టు విద్యాసంస్థ సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్.మూర్తి తెలిపారు. మన చిట్టి గేయాలు, మన దేవాలయాలు, మన పండగలు, మన ఆటలు, మన నృత్యాలు, మన నాయకులు, మన కవులు, మన జాతరలు, మన వృత్తులు, మన దేశం, మన జెండా గురించి చిన్నారులు ఈ కేరింతలు కార్యక్రమం ద్వారా తెలియజేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సాక్షి దినపత్రిక సంపాదకులు వర్ధెల్లి మురళి, గౌరవ అతిథిగా డెక్కన్ ఫైన్ కెమికల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఆనందరావులు హాజరవుతున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.

పీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



కార్తికేయకు చెక్కును అందిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్ : ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి తన కార్యాలయంలో మంగళవారం 83వ వార్డుకు చెందిన జక్కుల కార్తికేయ వైద్యం నిమిత్తం పీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. తన కుమారుని వైద్య సహాయం కోసం కార్తికేయ తల్లిదండ్రులు జక్కుల కృష్ణ, ధనలక్ష్మి ఎంపీ సత్యవతిని కొన్నాళ్ల క్రితం కలిసి, మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎంపీ తక్షణమే పీఎం రిలీఫ్ ఫండ్ కోసం సిఫారసు చేశారు. తాజాగా మంజూరైన చెక్కును బాధితుడు కార్తికేయకు కుటుంబ సభ్యుల సమక్షంలో ఎంపీ అందించారు. తమ కుమారుని చికిత్స కోసం స్పందించి, త్వరిత గతిన పీఎం రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేయించినందుకు కార్తికేయ కుటుంబ సభ్యులు ఎంపీ సత్యవతికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరేందుకు అవకాశం

ఆరిలోవ: విశాఖ వేలీ స్కూల్ సమీపంలోని ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో 2023–24 విద్యా సంవత్సరంలో శిక్షణ పొందడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ రవి తెలిపారు. ఇక్కడ ఆరు నెలలు, ఒకటన్నర సంవత్సరాల కోర్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరీ, బేకరీ అండ్ కన్‌ఫెక్షనరీ కోర్సుల్లో ఒక ఏడాది చదువుతో పాటు ఆరు నెలల పాటు ప్రాక్టికల్స్ ఉంటాయన్నారు. ఆయా కోర్సుల్లో చేరాలంటే 10వ తరగతి ఉత్తీర్ణత సాధించడంతో పాటు 2023 జూలై 1 నాటికి 25 ఏళ్లలోపు వయసుఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 28 ఏళ్ల లోపు వయసు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న వారు జూలై 25 లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆరు నెలల కాలపరిమితితో ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ కోర్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 10వ తరగతి ఉత్తీర్ణులై.. 18 ఏళ్ల వయసు నిండని వారు అర్హులన్నారు. జూన్ 20 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 0891–2553883, 2952083లో సంప్రదించాలని సూచించారు.

తగ్గేదే లే!



- కోటవురట్లలో 44.4 డిగ్రీలు
- పద్మనాభం, గంభీరంలో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు
- అనేక ప్రాంతాల్లో 42–44 డిగ్రీల మధ్య రికార్డు
- ఉమ్మడి విశాఖలో కొనసాగుతున్న సెగలు
- మరో మూడు రోజులు వడగాడ్పులు

సాక్షి, విశాఖపట్నం/తుమ్మపాల: ఎండలు యథావిధిగా మండుతున్నాయి. వడగాడ్పులు తగ్గేదే లే అంటున్నాయి. పైగా రోజురోజుకు తీవ్ర రూపం దాలుస్తున్నాయి. ఏప్రిల్ నెలలో సరికొత్త రికార్డును సృష్టిస్తున్నాయి. తీవ్ర ఎండలు, వడగాడ్పుల ధాటికి జనం విలవిల్లాడుతున్నారు. బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చిన వారు వడదెబ్బకు గురవుతున్నారు. వారం రోజుల నుంచి వేసవి తాపం అదుపు తప్పుతూనే ఉంది. మంగళవారం కూడా అంతకుమంచి ఉష్ణతీవ్రత వెదజల్లింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏప్రిల్‌లో తొలిసారిగా 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదై రికార్డు నెలకొల్పింది. సాధారణంగా ఏప్రిల్‌లో ఉమ్మడి విశాఖ జిల్లాలో 40 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదు కావడం అరుదు. అలాంటిది వారం, పది రోజుల నుంచి విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పలుచోట్ల 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. మంగళవారం అనకాపల్లి జిల్లా కోటవురట్లలో 44.4 డిగ్రీలు, దేవరాపల్లిలో 44.1, విశాఖపట్నం జిల్లా పద్మనాభంలో 44.04, ఆనందపురం మండలం గంభీరంలో 44 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదై తమ ప్రతాపాన్ని చూపించాయి. ఇవి సాధారణకంటే 4–6 డిగ్రీలు అధికం. మరో మూడు రోజులు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ వడగాడ్పులు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, ఒకవేళ తప్పనిసరై వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని వీరు సూచిస్తున్నారు.



ఎండ వేడి నుంచి గొడుగు రక్షణ

వడగాడ్పులపై అప్రమత్తం

వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా వడగాడ్పులు తీవ్రమైన శారీరక ఒత్తిడికి దారితీయవచ్చని, ప్రజలు మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్యలో బయటకు రావద్దని అనకాపల్లి డీఆర్వో పి.వెంకటరమణ ఒక ప్రకటనలో కోరారు. వడదెబ్బ కారణంగా మరణాలు సంభవించే అవకాశం ఉందన్నారు. మంచినీరు వీలైనంత ఎక్కువగా తాగాలన్నారు. తేలికైన, లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలన్నారు. కళ్ల జోడు, టోపీ, పాదరక్షలు తప్పనిసరిగా వినియోగించాన్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు శారీరక శ్రమతో కూడిన పనులు నివారించాలన్నారు. శరీరాన్ని డీహైడ్రేట్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీ, కార్బొనేటెడ్ శీతల పానీయాలకు దూరంగా ఉండాలన్నారు. అధిక ప్రొటీన్లు, నిల్వ ఉన్న ఆహారాన్ని తినకూడదన్నారు. పార్క్ చేసిన వాహనాల్లో పిల్లలను, పెంపుడు జంతువులను ఉంచకూడదన్నారు. ప్రయాణ సమయాల్లో మంచినీరు తోడుగా ఉండాలన్నారు. ఓఆర్ఎస్, లస్సీ, నిమ్మరసం, మజ్జిగ వంటి ఇంట్లో చేసిన పానీయాలను వినియోగించాలన్నారు. జంతువులను నీడలో ఉంచాలని, వాటికి తాగునీరు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.



పైప్ నీటితో దాహం తీర్చుకుంటున్న కాకి

మంగళవారం నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా.. (డిగ్రీల్లో)

జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత
అనకాపల్లి	కోటవురట్ల	44.40
అనకాపల్లి	దేవరాపల్లి	44.10
విశాఖపట్నం	పద్మనాభం	44.04
విశాఖపట్నం	గంభీరం	44.00
అనకాపల్లి	గాదిరాయి	43.54
అనకాపల్లి	రావికమతం	43.45
అనకాపల్లి	చోడవరం	43.53
అనకాపల్లి	సబ్బవరం	43.09
అల్లూరి	ఎర్రంపేట	42.63
అల్లూరి	కూనవరం	42.44
అల్లూరి	గంగవరం	42.15
విశాఖపట్నం	సింహాచలం	41.60
విశాఖపట్నం	ములగాడ	41.46

రీ సర్వే పక్కాగా చేయండి



జంపపాలెంలో రీ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

యలమంచిలి : రీ సర్వేలో లోపాలకు తావులేకుండా పక్కాగా చేపట్టాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం యలమంచిలి మండలం జంపపాలెం, తెరువుపల్లి గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియను ఆయన స్థానిక తహసీల్దారు రాణీ అమ్మాజీతో కలసి పరిశీలించారు.

రైతులు, సర్వే సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే, సరిహద్దు రాళ్ల ఏర్పాటులో సమస్యలపై కలెక్టర్‌కు రైతులు నివేదించారు. తెరువుపల్లిలో మున్సిపాలిటీకి చెందిన ఖాళీ స్థలాలను ఆయన పరిశీలించారు. స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, సర్వేయర్లు రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

ఉత్తమ డిస్కంగా నిలిపేందుకు కృషి

- ఈపీడీసీఎల్ సీఎండీగా బాధ్యతలు చేపట్టిన పృథ్వి తేజ్

దొండపర్తి(విశాఖ దక్షిణ): దేశంలోనే ఉత్తమ డిస్కంగా ఏపీఈపీడీసీఎల్‌ను నిలపడంలో తన వంతు కృషి చేస్తానని సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ పేర్కొన్నారు. ఏపీఈపీడీసీఎల్ నూతన సీఎండీగా ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం(ఆర్‌డీఎస్ఎస్), జగనన్న హౌసింగ్ కాలనీల విద్యుద్ధీకరణ, వ్యవసాయానికి పగటిపూట 9 గంటల విద్యుత్, 24/7 అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా, సంస్థ అందించే సేవలన్నింటిని వినియోగదారునికి చేరువ చేసేందుకు పటిష్టమైన చర్యలు చేపడతానని చెప్పారు.

భవిష్యత్తులో చేపట్టే అన్ని కార్యక్రమాలకు ఉద్యోగ సంఘాలు, యూనియన్ల నుంచి సహకారం తీసుకుంటానని పేర్కొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు, మరమ్మతు ఖర్చులు, ఆపరేషనల్–మెయింటెనెన్స్ వ్యయాలు తగ్గించటంపైన, సబ్ స్టేషన్ ఆటోమేషన్‌కు గ్లోబల్ సాంకేతికత వినియోగం, విద్యుత్ చౌర్యాలను అరికట్టడం, నష్టాలను తగ్గించడం, ప్రివెంటివ్ మెయింటెనెన్స్, సాంకేతిక విధానాలు అమలు, సాంకేతికత, కృత్రిమ మేధస్సు పైన దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. తనకు ఏపీఈపీడీసీఎల్ సీఎండీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇంధనశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి కె.విజయానంద్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన పృథ్వీతేజ్‌కి ఈపీడీసీఎల్ నుంచి ఎస్‌పీడీసీఎల్ సీఎండీగా బదిలీపై వెళ్తున్న కె.సంతోషరావుతో పాటు సంస్థ డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, ఎ.వి.వి.సూర్యప్రతాప్, రాధికా అనుసూరి, సంస్థ అధికారులు స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు.



పృథ్వీతేజ్ ఇమ్మడి

హాల్‌టికెట్ రాక.. వృత్తి విద్య పరీక్ష రాయలేక

- కేజీబీవీ నిర్వాహకుల తీరుతో విద్యార్థిని ఆవేదన
- న్యాయం చేయాలని ఎంఈవో వద్ద వేడుకోలు



తండ్రి జగన్నాథరావుతో విద్యార్థిని మౌళిక

మునగపాక: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా వృత్తి విద్యా కోర్సు చదువుకుంటున్న విద్యార్థిని పరీక్ష రాసే అవకాశం కోల్పోయింది. దీంతో విద్యార్థిని తల్లితండ్రులు ఆవేదన చెందారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎంఈవో వేణుగోపాలరావును, మునగపాక హైస్కూల్ పరీక్ష కేంద్రం ఇన్‌చార్జి సూర్యనారాయణను వేడుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో బాలిక నిరుత్సాహానికి గురైంది. వివరాలు ఇలా ఉన్నాయి. పాటిపల్లి బీసీ కాలనీకి చెందిన ఆడారి జగన్నాథరావు తన కుమార్తె మౌళికను స్థానిక కేజీబీవీలో 2018–19లో ఆరో తరగతిలో చేర్పించారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తోంది. మౌళిక 9వ తరగతిలో ఉండగానే వృత్తి విద్యా కోర్సులో చేరింది. ఫస్ట్ లెవెల్ పరీక్ష రాసింది. సెకెండ్ లెవెల్ పరీక్ష మంగళవారం రాసేందుకు సిద్ధమైంది. టెన్త్ పరీక్షలకు హాల్‌టికెట్ ఇచ్చిన యాజమాన్యం, వృత్తి విద్యా కోర్సు పరీక్షకు సంబంధించి హాల్‌టికెట్ ఇవ్వలేదు. ఈ విషయమై మౌళిక తల్లితండ్రులు విద్యాలయం ప్రత్యేకాధికారి రాణి దృష్టికి తీసుకురాగా పరీక్ష జరిగే సమయానికి హాల్‌టికెట్ వస్తుందని చెప్పారు. 18న పరీక్ష రాసేందుకు హైస్కూల్‌కు రాగా పరీక్షా కేంద్రం ఇన్‌చార్జి సూర్యనారాయణ హాల్‌టికెట్ లేకుండా పరీక్షకు అనుమతించేది లేదని చెప్పడంతో మౌళిక కన్నీటిపర్యంతమయింది.

విషయం తెలుసుకున్న తండ్రి జగన్నాథరావు ఎంఈవో వేణుగోపాలరావును కలిసి న్యాయం చేయాలని కోరినా ఫలితం లేకపోయింది. దీంతో చేసేదేం లేక తమ కూతురు జీవితంతో విద్యాలయం నిర్వాహకులు ఆడుకున్నారని, సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ విషయమై ఎంఈవో వేణుగోపాలరావు వివరణ కోరగా హాల్‌టికెట్లకు సంబంధించి దరఖాస్తులు పూర్తి చేసేటపుడు వృత్తి విద్యాకోర్సు నమోదులో టిక్ మార్క్ చేయకపోవడంతో మౌళిక పరీక్ష రాసేందుకు వీల్లేకపోయిందన్నారు. విద్యాలయం నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే తప్పు దొర్లిందని, ఇప్పటికే ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు చేరవేశామన్నారు. విద్యాలయం ఇన్‌చార్జి రాణిని వివరణ కోరగా మౌళికకు రానున్న సప్లిమెంటరీలో అవకాశం కల్పిస్తామని, దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు.

ఇఫ్తార్ విందులో డిప్యూటీ సీఎం బూడి



కాశీపురం మసీదులో ప్రార్థనలు చేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: ముస్లింల సంక్షేమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాలలో పెద్ద పీట వేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. కాశీపురం మసీదులో ముస్లిం సోదరులు మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముస్లిం మత పెద్ద రాజుదుద్దీన్ తదితరులతో కలిసి ఆయన ప్రార్థన చేశారు. ముస్లింలకు ముందస్తుగా రంజాన్ ఈద్ ముబారక్ తెలియజేశారు.

ఇఫ్తార్ తోఫాను డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు చేతుల మీదుగా అందజేశారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ దాసరి గోపి, ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

21న మెగా జాబ్‌మేళా

విశాఖ: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 21న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి(క్లరికల్) సిహెచ్.సుబ్బిరెడ్డి తెలిపారు. అరబిందో ఫార్మా, డెక్కన్ ఫైన్ కెమికల్స్, అపోలో ఫార్మా, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్ట్, జయభేరి ఆటో మొబైల్స్, సుగుణ ఫుడ్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో 723 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. బ్రాంచ్ మేనేజర్, స్సేల్ మేనేజర్, జూనియర్ కెమిస్ట్, ఫార్మసిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ టీమ్ లీడర్స్, టెక్నీషియన్స్, సర్వీసు అడ్వైజర్లు, సేల్స్ కన్సల్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్, గూడ్స్ ఇన్‌చార్జి ఉద్యోగాలకు ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లమా, బీకామ్(టాలీ), బీఫార్మసీ, డిఫార్మసీ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థు లు అర్హులన్నారు. జీతం నెలకు రూ.10,000 నుంచి రూ.30,000లు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాన్నారు.

మూల్యాంకనానికి రెడీ

- నేటి నుంచి టెన్త్ స్పాట్ వాల్యుయేషన్
- ఈ నెల 26 వరకు కొనసాగనున్న ప్రక్రియ

అనకాపల్లి రూరల్: పదో తరగతి పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాల మూల్యాంకనానికి (స్పాట్ వాల్యుయేషన్) రంగం సిద్ధమైంది. కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రంలోని కొత్తూరు ఏఎంఏఎ ఎయిడెడ్ హైస్కూల్ వేదికగా బుధవారం ఈ ప్రక్రియ మొదలుకానుంది. ఈ నెల 26 వరకూ కొనసాగనున్న జవాబు పత్రాల మూల్యాంకనం కోసం అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎగ్జామినర్లు జవాబు పత్రాలను దిద్దే ప్రక్రియ చేపడతారు. పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించిన ప్రభుత్వం విద్యార్థులు రాసిన సమాధాన పత్రాలను పక్కాగా మూల్యాంకనం చేసి ఫలితాలు విడుదల చేసేలా ఆదేశాలు జారీ చేసింది. శనివారం ఆఖరు పరీక్ష పూర్తయిన తర్వాత జవాబు పత్రాలను విద్యాశాఖ అధికారులు జిల్లా కేంద్రానికి తరలించి బార్ కోడింగ్ ప్రక్రియ సైతం ప్రారంభించారు. తొలిసారిగా కొత్త జిల్లా ప్రాతిపదికన నిర్వహిస్తున్న పది జవాబు పత్రాల మూల్యాంకనానికి జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

సిబ్బంది నియామకం పూర్తి

మూల్యాంకనం విధులకు మొత్తం 1285 మందిని నియమించారు. ఇందులో 826 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 200 మంది సీఈలు, 200 మంది స్పెషల్ అసిస్టెంట్లు, 9 మంది ఏసీవోలు, ఇతరులు 50 మంది విధులు నిర్వర్తించనున్నారు. ఒక్కొక్క ఎగ్జామినర్ రోజుకు 40 జవాబు పత్రాలు దిద్దాల్సి ఉంటుంది. మూల్యాంకనం నిర్వహించేందుకు ముగ్గురిని ఒక బృందంగా ఏర్పాటు చేస్తారు. ఒక్కో బృందం రోజుకు 120 జవాబు పత్రాలను దిద్దుతుంది. ముగ్గురు ఏఈలకు ఒక చీఫ్ ఎగ్జామినర్‌తోపాటు ఒక స్పెషల్ అసిస్టెంట్ మూల్యాంకనాన్ని పర్యవేక్షిస్తారు. ఏఈలు దిద్దిన జవాబు పత్రాలను సీఈలు క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. స్పాట్ క్యాంప్ ఆఫీసర్‌గా డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, ఏసీవోలుగా ఎన్.ప్రేమ్‌కుమార్, ఎ.రవిబాబు వ్యవహరిస్తున్నారు.



ఎగ్జామినర్లు జవాబు పత్రాలను దిద్దేందుకు ఫర్నిచర్ సిద్ధం చేస్తున్న సిబ్బంది

జిల్లాకు 1.80 లక్షల జవాబు పత్రాలు

సుమారు 1.80 లక్షల జవాబు పత్రాలు జిల్లాకు చేరుకుంటున్నాయి. జిల్లాలో 111 కేంద్రాల్లో ఈనెల 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరిగాయి. మొత్తం 23375 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో 1681మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారు. జిల్లాకు చేరిన జవాబు పత్రాలను ఇప్పటికే స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. మూల్యాంకన ప్రక్రియకు హాజరైన సమయం నుంచి బయటకు వెళ్లే వరకు ఉపాధ్యాయులు, అక్కడ పని చేసే సిబ్బందికి సెల్‌ఫోన్ నిషేధించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ లోపలికి ఎలాంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను తీసుకెళ్లకూడదని అధికారులు ఆదేశించారు. మూల్యాంకనం పూర్తయ్యేవరకు స్పాట్ క్యాంప్‌కు వేదికగా ఉన్న ఏఎంఏఎ ఎయిడెడ్ హైస్కూల్ వద్ద పూర్తి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సిబ్బందికి ఎవరికైనా అనారోగ్య సమస్యలు తలెత్తినా సత్వర వైద్య సేవలందించేందుకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అలాగే సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం లేకుండా క్యాంపు లోపల క్యాంటీన్ సహా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నారు. నియమావళిపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.



ఏఎంఏఎ స్కూల్‌లో మంగళవారం రాత్రి ఏర్పాట్లను సమీక్షిస్తున్న జిల్లా అధికారులు

ఏర్పాట్లు పూర్తి చేశాం

జిల్లాలో నేటి నుంచి జరగనున్న పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనానికి దాదాపుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. సిబ్బంది నియామకం పూర్తయ్యింది. నియామక ఉత్తర్వులను అందజేశాం. సెల్‌ఫోన్లకు అనుమతిలేదు. దిద్దుబాటులో అలసత్వం ప్రదర్శించి తప్పులు చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు. పక్కాగా నిబంధనల ప్రకారం మూల్యాంకనం చేపట్టాలి.

– ఎం.వెంకటలక్ష్మమ్మ, డీఈవో

శరవేగంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి

- నేడు రూ.4 వేల కోట్లతో నిర్మించే మూలపేట పోర్టుకు సీఎంతో శంకుస్థాపన
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇదొక చరిత్రాత్మక ఘట్టం
- 2025 కల్లా భోగాపురం ఎయిర్‌పోర్టులో తొలి విమానం
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఉత్తరాంధ్రలో పారిశ్రామిక అభివృద్ధి పరుగులు పెడుతుందని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రజలకు మేలు జరిగేలా శ్రీకాకుళంలో బుధవారం రూ.4 వేల కోట్లతో మూలపేట పోర్టు నిర్మాణంతో పాటు బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, హిరమండలంలో వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మంత్రి మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రలో బుధవారం చారిత్రక ఘట్టానికి అంకురార్పణ జరగబోతోందని, పూర్తిగా వెనుకబడిన ప్రాంతమైన శ్రీకాకుళం జిల్లా పారిశ్రామికంగా, ఆర్థికంగా పరిపుష్టి చెందాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న చర్యలు సఫలీకృతం కాబోతున్నాయని చెప్పారు. మూలపేట పోర్టు తొలిదశలో రూ.3000 కోట్లతో నాలుగు బెర్తులను నిర్మిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం భావనపాడు పోర్టు నిర్మిస్తామని మోసం చేసిందని, కానీ సీఎం జగన్ పోర్టు నిర్మిస్తామని ఇచ్చిన హామీని వాస్తవ రూపంలోకి తెస్తున్నారని చెప్పారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తికావొస్తోందని, ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో రూ.170 కోట్లతో మరో ఫిషింగ్ హార్బర్ నిర్మించనున్నట్లు తెలిపారు. మూలపేట పోర్టు, సిక్స్ లేన్ల హైవే నిర్మాణం పూర్తయితే శ్రీకాకుళం జిల్లా పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. బందరు, రామాయపట్నం పోర్టుల నిర్మాణాన్ని మరింత వేగవంతం చేస్తున్నామని చెప్పారు. రామాయపట్నం పోర్టుకు ఈ ఏడాది డిసెంబరు లేదా వచ్చే ఏడాది జనవరిలో తొలి నౌక వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

3న భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు శంకుస్థాపన

రూ. 3,500 కోట్లతో నిర్మించే భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు వచ్చే నెల 3న సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేస్తారని మంత్రి చెప్పారు. 2025 సంవత్సరం నాటికి మొదటి విమానం భోగాపురం ఎయిర్‌పోర్టులో దిగాలన్నదే సీఎం ఆకాంక్ష అని చెప్పారు.

స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వమే నడపాలి

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించకూడదన్నదే తమ ప్రభుత్వ విధానమని చెప్పారు. ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కార్మికులు చేపడుతున్న ఉద్యమాలకు రాష్ట్ర ప్రభుత్వం దన్నుగా నిలుస్తుందన్నారు. నష్టాల్లో ఉన్న అనేక పరిశ్రమలను నడుపుతున్న కేంద్ర ప్రభుత్వం.. స్టీల్ ప్లాంట్‌ను నడపడానికి ఎందుకు వెనకాడుతోందని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి కేంద్రం, దాన్ని కొంటామంటూ తెలంగాణ ప్రభుత్వం విశాఖలో అలజడి సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్మికుల పక్షాన నిలిచిన నాయకుడు

మళ్ల సత్యనారాయణకు ఘన నివాళి



మళ్ల సత్యనారాయణ భౌతికకాయంపై జెండా కప్పుతున్న లోకనాథం, బాలకృష్ణ

అనకాపల్లి టౌన్: మళ్ల సత్యనారాయణ మున్సిపల్ కార్మికుల పక్షాన పలు ఉద్యమాలు చేసిన యోధుడని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. మళ్ల సత్యనారాయణ ఇంటి వద్ద మంగళవారం జరిగిన సంతాప సభలో ఆమె మాట్లాడుతూ పార్టీ కౌన్సిలర్‌గా ఎన్నికై అనేక ఉద్యమాలు చేసిన ఘతన మళ్లకే దక్కుతుందన్నారు. అంతకు ముందు మళ్ల భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, ఎ.బాలకృష్ణ సత్యనారాయణ భౌతికకాయంపై సీపీఎం జెండా కప్పి నివాళులర్పించారు. పూడిమడకలోని మళ్ల సత్యనారాయణ స్వగృహం నుంచి స్థానిక నెహ్రూచౌక్, పెరుగుబజారు మీదుగా గవరపాలెం శ్మశానవాటికకు మళ్ల అంతిమ యాత్ర జరిగింది. వేలాది మంది సీపీఎం, సీఐటీయూ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, సీపీఎం నాయకులు గంటా శ్రీరాం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ మళ్లకు నివాళులర్పించారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత నాగేశ్వరరావు మృతి



ముంచంగిపుట్టు : మండలంలో గల సుజనకోట పంచాయతీ కేంద్రానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ మండల సీనియర్ నేత, విశాఖపట్నం హిందుస్థాన్ షిప్ యార్డు రిటైర్డ్ మేనేజర్ మండి నాగేశ్వరరావు (65) మృతి చెందారు. మంగళవారం ఉదయం ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా ఉండడంతో ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి బంధువులు తీసుకువచ్చారు. ఆయనను పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలిపి పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ నాగేశ్వరరావు మృతి చెందారు. గిరిజన ప్రాంతం మారుమూల సుజనకోట గ్రామంలో పేద కుటుంబంలో జన్మించిన ఆయన హిందుస్థాన్ షిప్‌యార్డు మేనేజర్ స్థాయికి ఎదిగారు. గిరిజన యువకుల చదువులకు ఆర్థిక సహాయం చేసి వారి ఉన్నతికి దోహదపడ్డారు. వైఎస్సార్‌సీపీలో చేరినప్పటి నుంచి పార్టీ కోసం అహర్నిశలు కృషి చేశారు. ఆయన మృతితో సుజనకోట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అన్న మందలించాడని తమ్ముడి ఆత్మహత్య



ఉరి వేసుకున్న షశుదేబ్

మునగపాక: ఉమ్మలాడ ఇటుకబట్టీలో పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రం బాలంగీర్ జిల్లా కరబాహాలీకి చెందిన యువకుడు తేల షశుదేబ్ (19) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ మహమ్మద్ అలీ తెలిపిన వివరాలు.. ఉమ్మలాడ తిరుమల వెంగమాంబ ఇటుక బట్టీలో గత నాలుగు నెలలుగా ఒడిశాకు చెందిన ఆరుగురు కుటుంబ సభ్యులు కార్మికులుగా పనిచేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం అందరూ భోజనం చేస్తున్న సమయంలో షశుదేబ్‌ను అతని సోదరుడు సెల్‌ఫోన్ వినియోగం తగ్గించి పనిపై దృష్టి సారించాలని మందలించాడు. తన అన్న మందలించడాన్ని తట్టుకోలేక మనస్థాపానికి గురైన షశుదేబ్ ఇంటి నుంచి కోపంతో బయటకు వెళ్లిపోయాడు. ఎంతకూ సోదరుడు రాకపోవడంతో కంగారుపడి పలు ప్రాంతాల్లో వెతకడం ప్రారంభించారు. రాత్రి 7.30 గంటల తరువాత సమీపంలోని శారదానది ఒడ్డున షశుదేబ్ చెట్టుకు వేలాడుతున్న షశుదేబ్ మృతదేహాన్ని గమనించారు. విషయం తెలుసుకున్న మునగపాక ఎస్ఐ మహమ్మద్ అలీ సంఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు కల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం షశుదేబ్ తండ్రి లలిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే

వడదెబ్బ నుంచి ఉపశమనం పొందండిలా..



ఎండలో యువతుల అవస్థలు



నక్కపల్లిలో ఎండ వేడిమి కారణంగా నిర్మానుష్యంగా ఉన్న జాతీయ రహదారి

నక్కపల్లి: భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఏప్రిల్ ఆరంభం నుంచే ఎండ తీవ్రత చురుక్కుమనిపిస్తోంది. ఉదయం ఎనిమిది గంటల నుంచే సూర్యుడు భగ్గుమంటున్నాడు. వేసవి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతల పరిస్థితి కూడా అలాగే ఉంది. ఉక్కపోతతో ప్రజలు అల్లాడి పోతున్నారు. వాతావరణ శాఖ కూడా ఏయే ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయో ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తోంది. రోహిణీ కార్తెతో సంబంధం లేకుండానే రోళ్లు పగిలే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మారిన ఉష్ణోగ్రతల ప్రభావం నుంచి ప్రజలను రక్షించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్ల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచింది.

ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం

- సాధ్యమైనంత వరకు ఉదయం 10లోపు.. సాయంత్రం 5 గంటల తర్వాత పనులు చేసుకోవాలి.
- తప్పని పరిస్థితుల్లో పగటి పూట బయటికి వెళ్లాలంటే లేత రంగు దుస్తులు ధరించి వెళ్లాలి.
- తెల్లరంగు టోపీలు ధరించాలి. గొడుగులు వెంట తీసుకెళ్లాలి.
- ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నిమ్మరసం, వాటర్ బాటిళ్లు వెంట తీసుకెళ్లాలి.
- ఎండలో బయటికి వెళ్లిన వారు నీరసంగా ఉన్నట్లనిపిస్తే వెంటనే సమీపంలో ఉన్న మందుల షాపుకు వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్ వాటర్‌బాటిల్లో కలుపుకుని తాగాలి.
- కొబ్బరి నీళ్లు, నిమ్మరసం తాగడం చాలా మంచిది.
- పగటి పూట షాపింగ్‌లకు దూరంగా ఉండటం మంచిది. చిన్నపిల్లలను బైక్‌లపై కూర్చోబెట్టి షాపింగ్‌లు చేయడం చాలా ప్రమాదకరం. ఇలా చేయడం వల్ల వడదెబ్బ తగిలి పిల్లలు డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.
- గర్భిణులు, బాలింతల విషయంలో కూడా ఇవే సమస్యలు ఎదురు కావచ్చు.

వడదెబ్బకు గురైతే..

- వడదెబ్బకు గురైతే వెంటనే వారిలో ఉష్ణోగ్రతను తగ్గించే ప్రయత్నం చేయాలి.
- తడిగుడ్డతో శరీరం అంతా వీలైనన్ని ఎక్కువ సార్లు తుడవాలి.
- సమీపంలో ఉన్న పీహెచ్‌సీకి తరలించాలి.
- నీడపట్టును ఉండి పని చేసుకునే వాళ్లయితే రోజుకు 4 నుంచి 5 లీటర్ల నీళ్లు తాగాలి. వీటితో పాటు నిమ్మరసం, ఓఆర్ఎస్ కలిపిన మరో లీటరు నీళ్లు లేదా, కొబ్బరి నీళ్లు తాగాలి.
- ఎండలో ఉంటూ పని చేసుకునే వారయితే రోజుకు 6 నుంచి 7 లీటర్ల నీళ్లు తాగాలి. అలాగే ఓఆర్ఎస్, నిమ్మరసం కలిపిన నీళ్లు, కొబ్బరి నీళ్లు కూడా తాగాల్సి ఉంటుంది.

వృద్ధులు, పిల్లల విషయంలో..

- వేసవిలో వృద్ధులు, పిల్లల విషయంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి పట్టున ఉన్నా కూడా వారికి వడదెబ్బ తగలవచ్చు. వడదెబ్బ తగిలి జ్వరం వస్తే తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదు. మామూలు జ్వరం మాత్ర వేస్తే సరిపోదు.
- ఒక్కో సమయంలో వడదెబ్బ వల్ల తీవ్రమైన జ్వరం వచ్చి కిడ్నీఫెయిల్ అయి మరణించే అవకాశం కూడా ఎక్కువగా ఉంటుంది.
- వెంటనే సమీపంలో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లి అత్యవసర చికిత్స చేయించాలి. సెలైన్ బాటిళ్లు ఎక్కించాలి.

ఏమాత్రం అశ్రద్ధ తగదు



వేసవిలో చంటి పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, బాలింతల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. జ్వరంగా ఉన్నా, తల తిరుగుతున్నా, నీరసంగా ఉన్నా, నోరు తడి ఆరిపోతున్నా అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలి. ఉపాధి పనులు చేసుకునే వారు అందుబాటులో మంచినీళ్లు, వీలైతే నిమ్మరసం వంటివి ఉంచుకోవాలి. ఎండ ముదరక ముందే పనులు ముగించుకుని ఇంటి బాట పట్టాలి.

– డాక్టర్ మురళీకృష్ణారెడ్డి, వైద్యాధికారి, మంగవరం పీహెచ్‌సీ

ఉద్యోగుల ధర్నా

తుమ్మపాల : ప్రభుత్వ ఉద్యోగుల సీపీఎస్ రద్దు, పీఆర్సీ ఏరియర్స్ రిలీజ్ చేయాలని డిమాండ్ చేస్తు కలెక్టరేట్ వద్ద జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు మంగళవారం ధర్నా చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని రాష్ట్ర ఏపీసీపీఈఏ ప్రెసిడెంట్ ఎస్.నాగరాజు అన్నారు. జిల్లా జేఏసీ చైర్మన్ ఎస్ఎస్‌వీఎస్ నాయుడు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

20న సస్టైనబులిటీ కాంక్లేవ్

ఏయూక్యాంపస్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, విశాఖపట్నం(ఐఐఎంవీ) వేదికగా ఈ నెల 20వ తేదీన సస్టైనబులిటీ కాంక్లేవ్‌ను నిర్వహిస్తున్నారు. భారత వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ది నేషనల్ ప్రొడక్టివిటీ కౌన్సిల్, డీపీఐఐటీ సౌజన్యంతో ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (ఐపీఎల్) సహకారంతో దీనిని నిర్వహిస్తున్నట్లు ఐఐఎంవీ సంచాలకులు ఆచార్య ఎం.చంద్రశేఖర్ తెలిపారు. ప్రొడక్టివిటీ అండ్ గ్రీన్ గ్రోత్ అంశంపై ఈ కాంక్లేవ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. శిలాజేతర ఇంధన సామర్థ్యాన్ని 2030 నాటికి 500 గిగావాట్‌కు పెంచడం లక్ష్యంగా భారత ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల నుంచి 50 శాతం వరకు ఇంధన అవసరాలను తీర్చే దిశగా ఇది నిలుస్తుందన్నారు. విద్యావేత్తలు, నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులు, ప్రభుత్వ శాఖలు దీనిలో భాగం చేస్తూ సదస్సును నిర్వహిస్తామన్నారు. రాష్ట్రానికి ఇది ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌వో డైరెక్టర్ రాజీవ్ రంజన్, రత్నీష్ ఝా, డాక్టర్ సీవీ చలపతి రావు పాల్గొని ప్రసంగిస్తారు.

కూల్‌కూల్‌గా..



పుచ్చకాయల విక్రయం



కొబ్బరి బొండం తాగుతున్న బాలిక

చోడవరం: మండే ఎండల్లో కాస్త చల్లబడేందుకు జనం పరుగులు తీస్తున్నారు. ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందేందుకు చిన్నాపెద్దా అంతా కూల్..కూల్... అంటూ పరుగులు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో తాటిముంజలు, పుచ్చకాయలు, కొబ్బరి బొండాలకు గిరాకీ పెరిగింది. చోడవరం, అనకాపల్లి, మాడుగుల, సబ్బవరం, పాయకరావుపేట, నక్కపల్లి, యలమంచిలి, తాళ్లపాలెం, నర్సీపట్నం, కోటవురట్ల ప్రధాన రహదారుల్లో ఎక్కడ పడితే అక్కడ వీటిని విక్రయిస్తున్నారు. వీటి ధరలు కూడా ఎండతో పాటే భగ్గుమంటున్నాయి. కొబ్బరి బొండాల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయి. ఎండలు ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో ఎలా ఉంటాయో అని ప్రజలు భయపడుతున్నారు.

భర్త ఇంటి ముందు భార్య ఆందోళన

అనకాపల్లి టౌన్: తనకు ఆడపిల్ల జన్మించిందని తన భర్త రాజశేఖర్ ఇంట్లోకి రానీయకుండా గేటుకు తాళం వేసి తనను, తన ఏడాది పాపను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నాడని భార్య రాధిక భర్త ఇంటి ముందు మంగళవారం రాత్రి ఆందోళనకు దిగింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో దర్జీనగర్‌కు చెందిన ఉండా రాజశేఖర్‌తో తుమ్మపాలకు చెందిన రాధికకు 2020లో వివాహమైంది. గత ఏడాది తనకు ఆడపిల్ల జన్మించడంతో కట్నం కోసం తీవ్రంగా వేధించడం మొదలుపెట్టాడని ఆమె తెలిపింది. తనకు పోలీసులు న్యాయం చేయాలని ఆమె పేర్కొంది.

శ్వాస అందక బాలింత మృతి

కోటవురట్ల: శ్వాస అందక ఓ గిరిజన బాలింత మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. అణుకు గిరిజన గ్రామానికి చెందిన ఎస్.జ్యోతి(33) తీవ్ర జ్వరంతో బాధపడుతూ మండల కేంద్రంలో ఉన్న సీహెచ్‌సీకి మంగళవారం వచ్చింది. వార్డులో చేర్చుకుని చికిత్స అందిస్తుండగా ఆక్సిజన్ లెవెల్స్ పడిపోవడంతో ఇంజక్షన్ చేసి ఆక్సిజన్ ఏర్పాటు చేశారు. అయినా పరిస్థితి విషమించడంతో మాకవరపాలేనికి చెందిన 108 వాహనంలో ఆక్సిజన్‌తో పాటు కృత్రిమ శ్వాస అందిస్తూ నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఏరియా ఆసుపత్రిలో పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- గుండెనొప్పి అని పాడేరు ఆస్పత్రిలో చేర్పించిన భార్య
- హత్యే అంటున్న మృతుని కుటుంబీకులు.. పోలీసులకు ఫిర్యాదు



విజయ్ మృతదేహం

పాడేరు రూరల్ : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి మృతుడి కుటుంబీకులు పాడేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబీకులు తెలిపిన వివరాలివి. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం నేరేడువలస గ్రామానికి చెందిన లొంజా విజయ్(35)కు ముంచంగిపుట్టు మండలం పెదగూడ పంచాయతీ చివ్వుకుచింత గ్రామానికి చెందిన సమరెడ్డి ప్రీతి అనే మహిళతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక పాప ఉంది. విజయ్ తండ్రి ఉద్యోగ విరమణ చేసి గతంలో మరణించారు. అతనికి వచ్చిన రిటైర్మెంట్ సొమ్ముతో విజయ్, అతని భార్య చోడవరంలో నివాసం ఉంటూ చిన్నపాటి ఫైనాన్స్ వ్యాపారం నడుపుతున్నట్టు తెలిసింది. మంగళవారం ఉదయం విజయ్‌కు గుండెపోటు వచ్చిందని, అతడి భార్య సొంత కారులో పాడేరు జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చి ఆస్పత్రిలో చేర్పించింది. విజయ్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించి మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. విషయం తెలుసుకున్న విజయ్ కుటుంబ సభ్యులు పాడేరు జిల్లా ఆస్పత్రికి చేరుకొని బోరున విలపించారు. విజయ్‌కు గుండెపోటు వస్తే స్థానికంగా ఉండే చోడవరం ఆస్పత్రిలో చేర్పించకుండా పాడేరు జిల్లా ఆస్పత్రికి తీసుకురావడమేంటని, అతడి మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతుడి కుటుంబీకులు పాడేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబీకులకు అప్పగించామని పాడేరు ఎస్ఐ లక్ష్మణ్ సాక్షికి చెప్పారు.

అక్రమంగా తరలిస్తున్న ఫర్నిచర్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కలపను చూపిస్తున్న డీఎఫ్‌వో

చింతూరు: వై రామవరం మండలం డొంకరాయి నుండి భద్రాచలానికి అక్రమంగా తరలిస్తున్న రూ.లక్ష విలువైన ఫర్నీచర్‌ను మంగళవారం అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. వ్యానులో కలప తరలిస్తున్నారనే సమాచారం మేరకు స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది సింగన్నగూడెం వద్ద అనుమానాస్పదంగా తారసపడిన వ్యానును తనిఖీ చేసినట్టు చింతూరు డీఎఫ్‌వో సాయిబాబ తెలిపారు. వ్యానులో కొండచీపుర్ల అడుగున అక్రమంగా తరలిస్తున్న రెండు మంచాలు, డైనింగ్ టేబుల్ సెట్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో రేంజ్ అధికారి మోహిని విజయలక్ష్మి, ఎఫ్ఎస్‌వో అరుణకుమారి, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది రవి, వెంకటేష్, రమేష్, రాజు పాల్గొన్నారు.

సిద్ధమైన ఇళ్ల పట్టాలు పంపిణీ చేయండి

'రెవెన్యూ'సమీక్షలో కలెక్టర్ మల్లికార్జున ఆదేశం

మహారాణిపేట: భూముల లావాదేవీలు జరిగినప్పుడు వెబ్‌ల్యాండ్‌లో ఎప్పటికప్పుడు మ్యుటేషన్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి మంగళవారం ఆర్డీవోలు, తహసీల్దార్లు, వీఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మీ-సేవ, ఏపీ సేవ, స్పందన ద్వారా ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను సమీక్షించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఏపీఐఐసీ, ఎన్‌హెచ్ 16, రైల్వే భూములకు సంబంధించి మ్యుటేషన్ పనులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. వైఎస్సార్ శాశ్వత భూ హక్కు, సర్వే పనులు నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీ ల్యాండ్ పూలింగ్ సమయంలో ఇళ్ల నిర్మాణానికి అనువైన భూములు సేకరించి.. అక్కడ అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. గాజువాక హౌసింగ్‌కు సంబంధించిన జీవో 301, 388పై ప్రజలకు సచివాలయాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇళ్ల పట్టాలను ప్రజలకు వెంటనే అందించాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఎస్డీసీలు, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ఆధార్ సేవలు

- పోస్టాఫీసులు, బ్యాంకుల వద్ద పడిగాపులకు చెక్
- దశలవారీగా అన్ని సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు



ఆధార్ శిబిరం ద్వారా సేవలు పొందుతున్న ప్రజలు

తుమ్మపాల : పోస్టాఫీసు, బ్యాంకుల్లో మాత్రమే అందించే ఆధార్ సేవలు ఇప్పుడు సచివాలయాల్లోనూ అందుబాటులోకి వచ్చాయి. ఆధార్ కార్డుల్లో తప్పుల సవరణ, కొత్త కార్డుల నమోదుకు గ్రామీణ ప్రజలు పడుతున్న ఇబ్బందులకు స్వస్తి పలికేందుకు ప్రభుత్వం సువర్ణావకాశం కల్పించింది. ఈ మేరకు అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లో సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఆధార్ అప్‌డేట్ క్యాంపులు నిర్వహిస్తోంది. దీంతో పనులు మానుకుని పోస్టాఫీసు, బ్యాంకుల్లో క్యూలు కట్టాల్సిన పరిస్థితులను నుంచి ప్రజలకు ఉపశమనం కలుగుతోంది.

సచివాలయాల్లోనే ఆధార్ అప్‌డేట్

దశల వారీగా అన్ని సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులోకి తీసుకోచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళిక చేసింది. గత ఏడాది డిసెంబర్ 31కి ఒక్కో సచివాలయంలో ఒక్కో రోజు చొప్పున శిబిరాలు నిర్వహించి మొదటి విడత పూర్తిచేశారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో రెండవ విడత ముగిసింది. ఇప్పుడు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించి, ప్రజలకు ఆధార్ అప్‌డేట్, తప్పుల సవరణ, కొత్త కార్డుల నమోదు వంటి సేవలను అందిస్తున్నారు. అనకాపల్లి పట్టణం(జీవీఎంసీ) పరిధిలో 26, మండల పరిధిలో 29 సచివాలయాలు ఉన్నాయి. కొన్ని సచివాలయాలకే ఆధార్ కిట్లు రావడంతో క్రమపద్ధతిలో ప్రతి సచివాలయంలో ఆధార్ సేవలు అందించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. కొన్ని సామాజిక ప్రాంతాల్లో కూడా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, ప్రజల చెంతకే వెళ్లి ఆధార్ సేవలు అందిస్తున్నారు.

నూతన జిల్లా పేరు నమోదు

జిల్లాల విభజన అనంతరం అడ్రస్ మార్పులు చేసుకునే వారి సంఖ్య లక్షల్లో ఉంది. అనకాపల్లి నూతన జిల్లా పేరును ప్రతి ఒక్కరి ఆధార్ కార్డు వివరాల్లో నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గతంలో విశాఖ జిల్లాగా ఉండటంతో అందరి కార్డుల్లో అదే నమోదై ఉంది. దీన్ని తొలగించి నూతన జిల్లా అనకాపల్లి పేరును నమోదు చేసుకునేందుకు పోస్టాఫీసులు, బ్యాంకుల్లో క్యూ కట్టాల్సిన పనిలేదు. నేరుగా గ్రామ/వార్డు సచివాలయానికి వెళ్లి ఉచితంగా అప్‌డేట్ చేసుకోవడంతోపాటు, మార్పులు, తప్పుల్ని కూడా సవరించుకోవచ్చు.

సవరణకు ఈ గుర్తింపు పత్రాలు చాలు

ఆధార్‌లో సవరణకు ప్రాథమికంగా ఏడు రకాల గుర్తింపు కార్డుల్లో ఏ ఒక్కటైనా సమర్పిస్తే చాలు. 2010 నుంచి 2016 వరకు ఆధార్ మార్పులు చేసుకోనివారు ఇప్పుడు తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి. ఇందుకు గుర్తింపు పత్రాలుగా పాన్ కార్డు, ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పదవ తరగతి మార్కుల జాబితా, యూఐడీఏఐ గుర్తింపు కలిగిన పత్రంలో గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ, గ్యాస్ బుక్, గ్రూప్–ఎ అధికారి ధ్రువీకరించిన పత్రం, ఆస్తిపన్ను పుస్తకం వగైరా పత్రాలను సమర్పించి ఆధార్ అప్‌డేట్ చేసుకోవచ్చు. లేదంటే రానున్న ఆగస్టు 31 నుంచి ఆధార్ సేవలు నిలిచిపోనున్నాయి.

మా ఊర్లోనే ఆధార్ మార్పులు



ఆధార్ కార్డులో సవరణలు చేసుకునేందుకు ప్రభుత్వం మా సచివాలయంలోనే వెసులుబాటు కల్పించింది. నూతన జిల్లా ఏర్పాటుతో ఆధార్‌లో అనకాపల్లి జిల్లా పేరు నమోదుకు అవకాశం కలిగింది. గతంలో బ్యాంకులు, పోస్టాఫీసుల ముందు భారీ క్యూలో నిల్చోవాల్సి వచ్చేది. ఇప్పుడు పట్టణానికి వెళ్లకుండా సచివాలయంలోనే ఆధార్ అప్డేట్ చేసుకున్నాం.

– దాసరి గోపాలరావు, తలారివానిపాలెం

ఆధార్ సేవలు వినియోగించుకోండి



ఆధార్ సేవలను ప్రభుత్వం సచివాలయాల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రతి సచివాలయంలో ఆధార్ శిబిరాల ద్వారా సేవలు అందిస్తున్నాం. పదేళ్ల నుంచి ఆధార్ అప్‌డేట్ చేసుకోని వారు తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి. పసిబిడ్డలకు కొత్త ఆధార్ కార్డు మంజూరు, పెద్దల ఆధార్‌లో అడ్రస్, పేరు తదితర వివరాలను సవరించుకోవచ్చు.

– కె.ధర్మారావు, ఈవోపీఆర్డీ, అనకాపల్లి మండలం

నేడు నూకాంబిక అమావాస్య పూజ



ప్రత్యేక అలంకరణలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం నూకాంబిక అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు మంగళవారం కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. నెల పండగలో భాగంగా అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. అమ్మవారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. బుధవారం నెల పండగలో భాగంగా అమ్మవారికి అమావాస్య పూజలు ప్రత్యేకంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బండారు ప్రసాద్ మీడియాకు తెలిపారు. ఆ రోజు ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తామన్నారు. తిరిగి మరుసటి రోజైన గురువారం తెల్లవారుజాము 5 గంటలకు పునఃదర్శనం కల్పించనున్నట్టు పేర్కొన్నారు. భక్తులు విషయాన్ని గమనించాల్సిందిగా కోరారు.

క్లుప్తంగా

మండుతున్న సూరీడు



నిర్మానుష్యంగా కశింకోటలో పంచాయతీ రోడ్డు

కశింకోట : కశింకోట ప్రాంతంలో మంగళవారం సూర్యుని తాపానికి ప్రజలు అల్లాడిపోయారు. గత కొన్ని రోజులుగా ఉన్న అధిక ఉష్ణోగ్రతలు మంగళవారం కూడా కొనసాగాయి. గరిష్ఠంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్టు అధికారుల అంచనా. అధిక ఉష్ణోగ్రతలకు తోడు స్వల్పంగా వడగాల్పులు కూడా కొనసాగాయి. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వృద్ధులు, పిల్లలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఎండల వేడికి స్థానిక పంచాయతీ ప్రధాన రోడ్లు నిర్మానుష్యంగా మారాయి.

అగ్ని ప్రమాదంపై అప్రమత్తం



తుమ్మపాల సుభద్ర గ్యాస్ గొడౌన్ వద్ద మాక్ డ్రిల్‌లో నరసింగరావు

అనకాపల్లిటౌన్ : అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తెలివిగా ఆలోచించి, ప్రమాదం నుంచి బయటపడాలని అగ్నిమాపక శాఖ అధికారి నరసింగరావు సూచించారు. మండలంలోని తుమ్మపాల, తోటాడ కూడళ్లలో ఉన్న హెచ్‌పీ గ్యాస్ గొడౌన్‌ల వద్ద అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గొడౌన్‌లో ప్రమాదం సంభవిస్తే ఎలా బయటపడాలో మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, గ్యాస్ సిలెండర్ల గొడౌన్ యజమానులు, గ్యాస్ డెలివరీ బాయ్స్ పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు

కశింకోట : మండలంలోని పలు సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ అప్‌డేట్ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. బుధవారం తాళ్లపాలెం–2, బయ్యవరం, ఉగ్గినపాలెం, 20న తాళ్లపాలెం–2, తేగాడ, జమాదులపాలెం, 26, 27 తేదీల్లో ఏఎస్ పేట, వెదురుపర్తి, చింతలపాలెం, జెట్టపురెడ్డితుని సచివాలయాల పరిధిలోని వారికి ఆధార్ అప్‌డేట్ చేస్తారని పేర్కొన్నారు. ఆధార్ కార్డు తీసుకున్నాక ఒక్కసారి కూడా అప్‌డేట్ చేసుకోని వారు ఆయా సచివాలయాలకు నిర్దేశించిన రోజుల్లో వెళ్లాల్సిందిగా సూచించారు.

చింతలపాలెంలో ఇఫ్తార్ విందు

కశింకోట : మండలంలోని చింతలపాలెం మసీదులో మంగళవారం సాయంత్రం రంజాన్ మాసం పురస్కరించుకుని ఇఫ్తార్ విందు నిర్వహించారు. సాయంత్రం వరకు ఉపవాస దీక్ష ఆచరించిన ముస్లింలు, సాయంత్రం దీక్ష విరమించి సంప్రదాయంగా ఇఫ్తార్ విందు ఆరగించారు. సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, కొట్టి రాము, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

రుద్రుడు	రాజా
మీటర్	సత్యనారాయణ స్క్రీన్-1
దంజన్స్ అండ్ డ్రాగన్స్	సత్యనారాయణ స్క్రీన్-2
రావణాసుర	షిర్డీసాయి
శాకుంతలం (3డి)	పర్తిసాయి
విడుదల(పార్ట్-1)	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 80 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–1 యూనిట్, బీ పాజిటివ్–34 యూనిట్లు, ఓ పాజిటివ్–44 యూనిట్లు, ఏబీ పాజిటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 368 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 309 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

వర్మీకంపోస్టుతో పంచాయతీలకు ఆదాయం



అవగాహన కల్పిస్తున్న జిల్లా పంచాయతీ రిసోర్స్ కేంద్రం సమన్వయకర్త నాగలక్ష్మి

కశింకోట : వర్మీ కంపోస్టు ఎరువు తయారీపై దృష్టి నిలపాలని జిల్లా పంచాయతీ రీసోర్స్ కేంద్రం సమన్వయకర్త నాగలక్ష్మి కోరారు. కశింకోటలోని దేవరవీధిలో ఉన్న సంపద తయారీ కేంద్రం వద్ద మంగళవారం సాయంత్రం సచివాలయ కార్యదర్శులతో సమావేశమై, వర్మీ కంపోస్టు తయారీపై సమగ్ర అవగాహన కలిగించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రానికి తరలించాలన్నారు. నిర్దేశిత ప్రక్రియ ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేసి విక్రయిస్తే పంచాయతీకి ఆదాయం సమకూరుతుందన్నారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, కార్యదర్శి ఎస్.రమేష్, సచివాలయ కార్యదర్శులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్ల నిర్మాణం



కనకమహాలక్ష్మి ఆలయం నుంచి జాతీయ రహదారికి వేస్తున్న రోడ్డు

కశింకోట : కశింకోటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంజూరు చేసిన రూ.50 లక్షలతో ఈ పనులు చేపట్టారు. దీనిలో భాగంగా రోడ్డును జేసీబీల సాయంతో చదును చేస్తున్నారు. దీనిపై మెటల్ పరిచాక, తారు రోడ్డు వేయనున్నారు. పనులను వేగవంతంగా చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. దాడి వారి వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నట్టు వెల్లడించారు.

ప్రజలందరి నమ్మకం జగన్



మహిళ నుంచి ప్రశ్నలకు సమాధానాలు రాసుకుంటున్న దాడి రత్నాకర్



ఇంటి గోడపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అతికిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : రాష్ట్రంలో పేదల ప్రభుత్వం నడుస్తోందని, ప్రజలందరి నమ్మకం జగనన్నేనని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. గవరపాలెం 80వ వార్డు పరిధిలో మంగళవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. నవరత్న పథకాలన్నీ తిరిగి కొనసాగాలంటే మనందరి ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. పేదల ముంగిటకే సంక్షేమ పథకాలు రావాలంటే సీఎంగా మరోసారి జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలని కోరారు. ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఇంటి యజమానులను ప్రశ్నలు అడిగి, నమోదు పుస్తకంలో రాసుకున్నారు. వారి అనుమతితో ఆయా ఇళ్లకు జగనన్న స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నేతలు కర్రి శ్రీమన్నారాయణ, శిలపరశెట్టి బాబీ, బొడ్డేడ శంకరరావు, దాడి ఈశ్వరరావు, కర్రి అప్పాజీ, కోరుబిల్లి ఆరుద్ర, కోరిబిల్లి పరి, విల్లూరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలమాంబిక, ముసిలితల్లి జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్లు

అనకాపల్లిటౌన్ : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దరి పోలమాంబిక అమ్మవారి జాతర మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. అమ్మవారిని 82, 83వ వార్డుల కార్పొరేటర్లు మందపాటి సునీత, జానకిరామరాజు, జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులు దర్శించుకుని, పూజలు చేశారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు, రెల్లికుల సంక్షేమ సంఘం సభ్యులు సునీత, ప్రసన్నలక్ష్మి దంపతులను సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. జాతీయ రహదారిలోని ముసిలితల్లి అమ్మవారి పండగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ మళ్ల సురేంద్రలు దర్శించుకుని, పూజలు చేశారు.

పట్టుతప్పితే అంతే!



సినిమాహాలు వద్ద ధ్వంసమైన రోడ్డు

పరవాడ: యలమంచిలి–గాజువాక రహదారిలో పరవాడ సినిమాహాలు సమీపంలో రహదారి అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణికులు, కార్మికులు అవస్థలు పడుతున్నారు. రహదారిలో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాల కారణంగా రోడ్డు పెచ్చులుగా ఊడిపోయి ధ్వంసమైంది. ఇక్కడి పరిశ్రమలకు 30 నుంచి 40 టన్నుల బరువు కలిగిన వాహనాలు రాకపోకలతో రహదారి ఎక్కడికక్కడ ఛిద్రమవుతోంది. రహదారి దెబ్బతిన్నచోట భారీ వాహనాలు తప్పించుకునే క్రమంలో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇంటింటా సంక్షేమం



వెన్నలపాలెంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న మండల జేసీఎస్ కన్వీనర్ సన్యాసిరావు



రావాడలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న పార్టీ నాయకులు

పరవాడ: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమని మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు అన్నారు. వెన్నలపాలెంలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని అడిగి తెలుసుకొన్నారు. వారి సమ్మతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇళ్ల పై అతికించారు. సంక్షేమ పథకాలు పూర్తి కాలం అందాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి ప్రజల అండగా నిలవాలని సన్యాసిరావు కోరారు.

- రావాడలో వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.
- వాడచీపురుపల్లిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ నాలుగేళ్లగా అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలవాలని కోరారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సబ్బవరం: పరిశ్రమల్లో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా ప్రమాదాలను నియంత్రించవచ్చని సబ్బవరం అగ్నిమాపక అధికారి దిలీప్ కుమార్ అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బాటజంగాలపాలెంలోని క్రీమ్ లైన్ డెయిరీలో సిబ్బందికి మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిశ్రమల్లో అగ్నిప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉందన్నారు. దీంతో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పలు మెళకువలు వివరించారు. అగ్ని ప్రమాదాలను నివారించేందుకు చేపట్టిన పలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ కె. అప్పలనాయుడు, డ్రైవర్ ఆపరేటర్స్ సీహెచ్ రమేష్ బాబు, ఫైర్‌మెన్ ఎఆర్‌కే శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న వృద్ధురాలు రాములమ్మ

పరవాడ: మండలంలో పి.బోనంగి శివారు వి.ఎల్.ఎస్.పురం గ్రామానికి చెందిన కూండ్రపు రాములమ్మ అనే వృద్ధురాలిపై మంగళవారం మధ్యాహ్నం వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. రాములమ్మ పశువులకు గడ్డి కోసుకొని పశువుల పాక వద్దకు వెళ్తుండగా కుక్కలు మూకుమ్మడిగా దాడి చేసి రాములమ్మ కాలిపై తీవ్రంగా గాయాలు చేశాయి. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి కుక్కలను తరమడంతో రాములమ్మ ప్రాణాలతో బయట పడింది. తీవ్రంగా గాయపడిన వృద్ధురాలిని పరవాడ పీహెచ్‌సీకి తరలించి మెరుగైన వైద్యం అందించారు. కాగా గ్రామంలో కుక్కలు బెడద అధికంగా ఉన్నప్పటికీ పంచాయతీ అధికారులు వాటి నివారణకు కనీస చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు.

పాడి రైతులకు సౌకర్యాలు కల్పిస్తాం–ఆడారి

అచ్యుతాపురం(అనకాపల్లి): విశాఖ డెయిరీ పరిధిలోని పాల సరఫరాదారులకు అన్ని రకాల వసతులు కల్పిస్తామని డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. మంగళవారం అచ్యుతాపురం మండలంలోని మడుతూరు విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రానికి విచ్చేసిన ఆయన రైతులతో మాట్లాడారు. రైతుల వినతి మేరకు పొలాలకు వెళ్లే మార్గానికి గ్రావెల్ రోడ్డు వేయిస్తామని, శ్మశాన వాటికలో షెడ్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. డెయిరీ డిప్యూటీ జనరల్ మేనేజర్ పాండ్య రాజన్, డెయిరీ సీనియర్ మేనేజర్ చుక్కా సోమునాయుడు, అచ్యుతాపురం యూనిట్ మేనేజర్ పడాల గుర్నాథరావు, సీనియర్ సూపర్‌వైజర్ మూర్తి, స్థానిక సంస్థ అధ్యక్షుడు శనివాడ ఆనంద పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



శంకరంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన యువత

తుమ్మపాల : అనకాపల్లి మండలం శంకరం గ్రామంలో బీబీఆర్ స్నేహితుల ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ప్రారంభించారు. యువకులు మంచినీరు, చల్లని మజ్జిగను ప్రయాణికులకు పంపిణీ చేశారు. వేసవితాపాన్ని దృష్టిలో పెట్టుకుని అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై ప్రయణించే వారికి అందుబాటులో మంచినీరు ఉంచుతామన్నారు. కార్యక్రమంలో హనుమాన్, విజయ ఆంజనేయ స్వామి యువజన సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్య, వైద్యం సీఎం జగన్ ధ్యేయం

- ప్రజా సమస్యల పరిష్కారానికి ఇదొక అత్యుత్తమ వేదిక
- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి అమర్‌నాథ్



మహిళ నుంచి ఆశీర్వాదం పొందుతున్న మంత్రి అమర్‌నాథ్



దివ్యాంగునితో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్



పీహెచ్‌సీలో వైద్య పరికరాలను పరిశీలిస్తున్న మంత్రి

అనకాపల్లిటౌన్ : పేదలకు మెరుగైన విద్య, వైద్యానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన 84వ వార్డు పరిధి సిరసపల్లి, ఎన్టీఆర్ నగర్‌లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫలాలపై ఆరా తీశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వేదికగా మారిందన్నారు. ఎన్టీఆర్ కాలనీలో ఎదురుపడిన దివ్యాంగుని వద్దకెళ్లి పింఛన్ సక్రమంగా అందుతుందా లేదా అని ఆరా తీశారు. దివ్యాంగుడు ఇల్లు నిర్మించుకునేందుకు, ఆర్థిక సాయం చేయాలని వేడుకున్నాడు. స్పందించిన మంత్రి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్. జగన్‌ని గెలిపించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. అంతకు ముందు రూ.కోటీ 30 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. రోగులకు అందించనున్న వైద్య సేవలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిని అనుకుని ఖాళీగా ఉన్న స్థలంలో సీఎస్ఆర్ నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి జీవీఎంసీ నుంచి అవసరమైన అనుమతులు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రూ.20 లక్షలతో చేపట్టనున్న ఇంటర్నల్ సీసీ రోడ్డు, కాలువలు, కల్వర్టు పనులకు శంకుస్థాపన చేశారు.

ఎంపీడీవో ధర్మారావు, తహసీల్దార్ గంగాధరరావు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, వార్డు ఇన్‌చార్జి నీలబాబు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలకా యశోద, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, పార్టీ నేతలు కొణతాల మురళీకృష్ణ, ఆళ్ల నాగేశ్వరరావు, ఈగల మహేష్, కె.సురేష్, గొల్లవిల్లి నరసింగరావు, కోరుకొండ రాఘవ, కె.శంకర్, మలసాల కిశోర్ పాల్గొన్నారు.